జ్వాల

# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.
DASHANEWS
.COM

సోమవారం
01 12 2025

సంపుటి 1 సంచిక 11

పేజీలు : 04

RNI :
TGTEL/25/A4195



విలేకరులు కావలెను

నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ ఆర్.సీ.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ క్రైమ్ రిపోర్టర్లు

7337546647
(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)




### క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

క్రీడా పోటీలతో సంపూర్ణ ఆరోగ్యం లభించడంతో పాటు ఉత్సాహాన్నిస్తుందని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం అన్నారు. సింగరేణి కాలరీస్ కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మూడు రోజులపాటుగా జరిగిన కోల్ ఇండియా స్థాయి పురుషుల కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది.

3



### ఆన్లైన్ బెట్టింగ్ తో అప్పుల పాలై యువకుడు ఆత్మహత్య

ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన

4



### అటు చదువు.. ఇటు వ్యవసాయం

ప్రస్తుత తరుణంలో ఎంతో అనుభవమున్న రైతులు కూడా వ్యవసాయాన్ని వదులుకుంటున్న ఘటనలు చూస్తున్నాం. కానీ, బిసి గురుకుల పాఠశాల విద్యార్థులు మాత్రం మేం పంటలు పండిస్తామంటూ పొలంబాట పట్టి తీవ్రంగా శ్రమిస్తున్నారు.

4



## రాహుల్ గాంధీకి కేటీఆర్ సంచలన లేఖ

- తెలంగాణ ప్రజలకు రూ.5 లక్షల కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం.
- ఇండస్ట్రీయల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ పాలసీ భారతదేశంలో అతిపెద్ద భూ కుంభకోణాల్లో ఒకటని ఆరోపణలు.

**దశ, హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రవేశపెట్టిన హైదరాబాద్ ఇండస్ట్రీయల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ పాలసీ ను స్వతంత్ర భారతదేశంలో అతిపెద్ద భూ కుంభకోణాల్లో ఒకటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపణలు చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. అత్యంత అవినీతితో కూడుకున్న ఈ విధానం తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర ఆందోళన, అనుమానాలు కలిగిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాల గురించి కాంగ్రెస్ హై కమాండ్‌కు తెలుసా.. లేకపోతే కావాలని మౌనంగా ఉన్నారా అని ప్రశ్నించారు. ఈ అవినీతి కారణంగా అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలు వాటి అసలు మార్కెట్ విలువలో నామమాత్రపు ధరకే పూర్తిగా సొంతం చేసుకోవడానికి వీలు కల్పిస్తోందని అన్నారు. దీనివల్ల తెలంగాణ ప్రజలకు రూ.5 లక్షల కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని కేటీఆర్ హెచ్చరించారు

..మిగతా 4వ పేజీలో

# తెలంగాణకు రెండో మణిహారం



## రెడీ చేసుకుంటున్నాం : సీఎం రేవంత్‌రెడ్డి

### రాష్ట్రానికి నాలుగు కొత్త ఎయిర్ పోర్టులు

### ఓఆర్ఆర్ లోపలి ప్రాంతం మొత్తాన్ని కోర్ అర్బన్ రీజియన్‌గా గుర్తించాం..

### తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్లపై మీటింగ్‌లో చర్చ




### తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై సీఎం

**దశ, హైదరాబాద్ :**

రాష్ట్ర ఆదాయం పెంచుతామని..పేదలకు పంచుతామని వివరించారు. తెలంగాణకు రెండో మణిహారం రెడీ చేసుకుంటున్నామని.. రాష్ట్రానికి నాలుగు కొత్త ఎయిర్ పోర్టులు రాబోతున్నాయని స్పష్టం చేశారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్లపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మీడియాతో ముఖ్యమంత్రి మాట్లాడారు. డిసెంబరు 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. అభివృద్ధి చెందిన తెలంగాణను అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్ కోసం పారదర్శక పాలసీలు తెస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ల గురించి వివరించారు. విజన్ డాక్యుమెంట్‌లో రెండు ప్రధాన అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఒకటి విజన్, రెండోది స్ట్రాటజీ ఉన్నాయని చెప్పుకొచ్చారు. అభివృద్ధి చెందిన తెలంగాణను అందించడమే లక్ష్యమని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ ORR లోపలి ఏరియాలో వివిధ విభాగాల పాలన ఉందని తెలిపారు. అందుకే ఈ ప్రాంతం మొత్తాన్ని కోర్ అర్బన్ రీజియన్‌గా గుర్తించామని చెప్పుకొచ్చారు. కాలుష్య రహితంగా హైదరాబాద్‌ను మార్చాల్సి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రేపు, ఎల్లుండి ఈ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌ను మంత్రులు, సంబంధిత విభాగాల అధికారులు తమ శాఖ పరిధిలోని ప్రతి ఆంశాన్ని చర్చించి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని దిశానిర్దేశం చేశారు. డిసెంబరు 2వ

..మిగతా 2వ పేజీలో →

## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ..

# 37 మంది లొంగుబాటు

**దశ,హైదరాబాద్ :** ఇటీవల మావోల వరుస లొంగుబాట్ల నేపథ్యంలో.. మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లో తాజాగా, మరో 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దంతెవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ ఎదుట మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 12 మంది మహిళలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరిపై రూ.67 లక్షల రివార్డు ఉంది. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ పాలసీ ప్రకారం తక్షణ సాయం కింద రూ.50 వేలు చొప్పున

4వ పేజీలో





### తెలంగాణలో ప్రజా పాలన ఉత్సవాలు..

## డిసెంబర్ 1 నుంచి 13 వరకు

**దశ, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తి కావడం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవడంతో రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా పాలన ఉత్సవాలు' ఘనంగా నిర్వహించబోతున్నారు. డిసెంబర్ 1 నుంచి 9 వరకు రోజూ ఒక ఉమ్మడి జిల్లాలో ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. ప్రజలకు మరింత చేరువయ్యే పాలన, పారదర్శకత, వేగవంతమైన అభివృద్ధి.. ఇవే మా ప్రభుత్వ లక్ష్యాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ సందర్భంగా చెప్పారు. ప్రజా పాలన ఉత్సవాల ద్వారా గత రెండేళ్లలో చేసిన పనులను ప్రజల ముందుంచుతూనే, 2047 నాటికి తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దే విజన్‌ను పంచుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ ఈ ఉత్సవాల్లో భాగం కావాలని

..మిగతా 4వ పేజీలో

## రెండో దశ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం

### 193 మండలాల్లోని 4,333 పంచాయతీలు, 38,350 వార్డులకు ఎన్నికలు



**దశ, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల రెండో దశ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. నేటి నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు ఈ నామినేషన్లను స్వీకరిస్తారు. 3వ తేదీన ఈ నామినేషన్లను పరిశీలించనున్నారు. డిసెంబర్ 5వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ.. అదే రోజు అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. డిసెంబర్ 14వ తేదీన ఈ రెండో దశ ఎన్నికల పోలింగ్ జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 193 మండలాల్లోని 4,333 పంచాయతీలు, 38,350 వార్డులకు ఈ ఎన్నికలు నిర్వహిస్తారు.

**తొలి విడతలో..**

ఇక తొలి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ గడువు నిన్నటితో అంటే.. నవంబర్ 29వ తేదీతో ముగిసింది. గత అర్థరాత్రి వరకు ఈ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం జరిగింది. శనివారం చివరి రోజు కావడంతో నామినేషన్లు దాఖలు చేసేందుకు భారీగా అభ్యర్థులు పోటెత్తారు. దాఖలైన నామినేషన్లను అధికారులు.. ఈ రోజు అంటే అదివారం పరిశీలించనున్నారు. డిసెంబర్ 11వ తేదీన రాష్ట్రంలో పంచాయతీ తొలి విడత ఎన్నికల పోలింగ్ జరగనుంది. మొదటి దశలో 31 జిల్లాల్లోని 189 మండలాల పరిధిలో 4,236 గ్రామ పంచాయతీలు, 37,440 వార్డులకు పోలింగ్ జరగనుంది. మరోవైపు మూడో విడతలో రాష్ట్రవ్యాప్తంగా 182 మండలాల్లోని 4,159 పంచాయతీలు, 36,452 వార్డుల్లో ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 12,728 సర్పంచ్ స్థానాల కు.. 1,12,242 వార్డులకు మొత్తం మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనుంది. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్ నిర్వహించనుంది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఈ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో.. ఆ రోజు నుంచి తెలంగాణలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.



## నామినేషన్ కేంద్రాలను సందర్శించిన డీసీపీ

**దశ ఆమనగల్లు :** పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని మండలంలో ఆదివారం ప్రారంభమైన నామినేషన్ల పర్వం మొదలైంది. సీఐ జానకిరామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై వెంకటేష్ నేతృతంలో పోలీసులు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేశారు. మండలం పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఎం ఆర్ సీ భవనంలో ఏర్పాట్లు చేసిన నామినేషన్ ల దాఖలు కేంద్రాన్ని శంషాబాద్ డీ సీ పీ రాజేష్, షాద్ న గర్ ఏసీపీ లక్ష్మీనారాయణతో కలిసి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. స్థానికంగా ఉన్న పరిస్థితులు, బందోబస్తు ఏర్పాట్లు, పోలింగ్ కు సంబంధించిన ఏర్పాట్లపై ఆరా తీశారు. ఎన్నికలు సజావుగా ప్రశాంతంగా నిర్వహించడానికి పోలీసు శాఖ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద బందోబస్తు కొనసాగుతుందన్నారు. అంతకుముందు స్థానిక పోలీస్ స్టేషన్ ను సందర్శించారు . ఆమనగల్లు పోలీస్ సర్కిల్ పరిధిలో నామినేషన్ కేంద్రాల్లో చేపట్టిన భద్రత చర్యలు, బందోబస్తు తదితర అంశాలను తెలుసుకొని పలు కీలక సలహాలు సూచనలు తెలియజేశారు.

## మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ లోకి చెరికలు



**దశ, బాన్సువాడ :** బీర్కూర్ మండల పరిధిలోని బైరాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ కార్యకర్తలు జోగు నర్సింలు, పందుల సుధాకర్, గుడి కొండ సాయిలు, కొండు పండరి, తుకారాం, కమ్మరి బాబు,దుర్గయ్య, హన్మండ్లు, కొంద్రరాములు,పోతురాజు రాజు, నిరుడి రాజు, లస్మాపురం దశరథ్ బాన్సువాడ లోని నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పోచారం భాస్కర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు ఈ సంధర్బంగా పార్టీ కండువా కప్పి పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించారుపాల్గొన్న బీర్కూర్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని తెలిపారు ఈ కార్యక్రమం లో బీర్కూర్ మండల మాజీ ఎంపీపీ తిలకేశ్వరి రఘు,కాంగ్రెస్ పార్టీ నాయకులు మియ్యాపురం శశికాంత్,సహకార సంఘం అధ్యక్షులు ఇంగు రాములు, ఏ.ఎం.సి వైస్ చైర్మన్ యామ రాములు, బసవరాజ్ పటేల్,పండరి తదితర బైరాపూర్ నాయకులు పాల్గొన్నారు.

## బిజెపి సర్పంచ్ అభ్యర్థిగా లింగాపురం రవి



**దశ, బాన్సువాడ:** బీర్కూర్ మండలం కిష్టాపూర్ బిజెపి పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా లింగపురం రవి బరిలో నిల్వనున్నారు. ఈ సందర్భంగా లింగాపురం రవి మాట్లాడుతూ.. 10సంవత్సరాల కాలంలో టిఆర్ఎస్ పార్టీ, రెండు సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ప్రతి సంక్షేమ పథకంలో కేంద్ర ప్రభుత్వం యొక్క వాటా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని మోడీ నాయకత్వంలో భారతదేశం చాలా అభివృద్ధి చెందిందన్నారు. తెలంగాణలో కోటి 20 లక్షల కుటుంబాలకు 5 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేసి, పేద ప్రజల ఆకలి తీరుస్తుందన్నారు. తెలంగాణలో గ్రామాలు అభివృద్ధి చెందాలంటే బిజెపి పార్టీ సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలన్నారు గ్రామాల అభివృద్ధి బిజెపి పార్టీతోనే సాధ్యమన్నారు. బిజెపి పార్టీ యువనాయకత్వాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లోనవ్వకుండా బిజెపి పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలన్నారు.

## మద్దెల ఆధ్వర్యంలో తోట దేవి ప్రసన్నకు సన్మానం



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా నియమించబడిన తోట దేవి ప్రసన్నను భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం అభ్యుదయ కళాసేవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరిచ్చి అభినందించారు. ఈ సందర్భంగా ఆచార్య డాక్టర్ మద్దెల మాట్లాడుతూ తోట దేవి ప్రసన్నకు దక్కిన ఈ ప్రతిష్టాత్మకమైన పదవిని పేద వర్గాల వారికి మహిళల సంక్షేమం కోసం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టను పెంచడం కోసం వినియోగించాలని సూచించారు. దేవి ప్రసన్న భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థానాలను అధిరోహించాలని అందుకు కావలసిన శక్తి సామర్థ్యాలను ఆమెకు దేవుడు ప్రసాదించాలని పేర్కొన్నారు. ఇంత గొప్ప పదవిని కట్టబెట్టిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ఆచార్య డాక్టర్ మద్దెల కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తోట దేవి ప్రసన్న, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ లతోపాటు సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అపర బాలు అల్లి శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉపాధ్యాయ ఉద్యమాల యోధుడు డి.సుధాకర్, సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బడికల పుష్పలత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తంగేళ్ల లక్ష్మణ్, సంఘ రాష్ట్ర కార్యదర్శి వైద్య విద్వాన్ డాక్టర్ తమ్మల్ల జోసెఫ్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు వేదికగా "ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ"

- ప్రారంభానికి సమగ్ర ఏర్పాట్లు చేయాలి
- అధికారులు క్రమశిక్షణతో బాధ్యతలు నిర్వర్తించాలి
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలోరహదారులు నీటిపారుదల విద్యుత్ రంగాల అభివృద్ధి
- గోదావరి జలాలను ప్రతి ఎకరకు చేరవేసే దిశగా అడుగులు
- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల సమీక్షలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు వేదికగా డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈనెల 2వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విచ్చేయనున్న సందర్భంగా నేపథ్యంలో ఆదివారం ఏర్పాట్లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమగ్రంగా పరిశీలించారు. ముందుగా ఆయన శిలాఫలకం ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం యూనివర్సిటీ ప్రాంగణాన్ని పర్యవేక్షించి జరుగుతున్న పనుల పురోగతిని వివరంగా తెలుసుకున్నారు. సభాస్థలాన్ని సందర్శించిన మంత్రి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లపై అధికారుల నుండి వివరాలు తెలుసుకొని సూచనలు ఇచ్చారు. తరువాత యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని ఏర్పాట్లను సమీక్షించారు.

అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ భూగోళ శాస్త్రాలు, సహజ వనరులు, ఖనిజ పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా నిలిచే విధంగా దేశంలోనే ప్రత్యేకత కలిగిన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని తెలిపారు. గతంలో సింగరేణి నిర్వహించిన "స్కూల్ ఆఫ్ మైన్స్" అనుభవాన్ని గుర్తుచేస్తూ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ స్థాపనకు చేసిన కృషి గురించి వివరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కొత్తగూడెం జిల్లాలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ స్థాపన గర్వకారణమని ఎమ్మెల్యే తెలిపారు. డిసెంబర్ 2న జరిగే యూనివర్సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తరువాత ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్ని శాఖల వారీగా చేపడుతున్న పనుల పురోగతిని బాధ్యతల అప్పగింపును మంత్రికి వివరించారు.

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్యమంత్రి పర్యటనకు చేపడుతున్న భద్రతా చర్యలు ఏర్పాట్లను వివరించారు. శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి వ్యక్తిగతంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను ప్రజల ప్రతిష్ఠకు తగిన విధంగా అత్యుత్తమంగా నిర్వహించేందుకు అందరూ కలిసి పనిచేయాలని కోరారు. పర్యటన విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, డాక్టర్ మనోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రిన్సిపల్ డాక్టర్ జగన్మోహన్ రాజుతో పాటు అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల సమస్యలపై పోరాడే వారిని గెలిపించుకోవాలి: ముత్యాల యాదిరెడ్డి

**దశ, అబ్దుల్లాపూర్ మెట్ :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజల సమస్యలపై పోరాడే వారిని గెలిపించుకోవాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భం సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో జేఎన్ఎన్ యూఆర్ యం కాలనీలో ప్రత్యేకమైన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి హాజరై మాట్లాడుతూ... ప్రజల సమస్యలపై పోరాడే వారిని గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. పంచాయతీ ఎన్నికల్లో మండల పరిధిలోని అన్ని గ్రామాలలో సర్పంచ్, వార్డు లలో స్థానాలలో సీపీఐ పార్టీ తరపున పోటీ చేయబోతున్నట్లు తెలిపారు. మండలపరిధిలోజేఎన్ఎన్ యూఆర్ యం కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రజలకు మంచినీటి సమస్య తీర్చి, ఉచిత విద్య, వైద్యం అందించాలన్నారు. కమ్యూనిస్టుల ద్వారానే ప్రజా సమస్యల పరిష్కారం అవుతాయన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును వినియోగించుకుని.. ప్రజల కోసం పనిచేసే వారిని గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీర హరి సింగ్ నాయక్, నేతలు నరసింహ, రమేష్ నాయక్, బిక్షపతి, నాగేశ్వరరావు, లక్ష్మణ్, నరసింహ, అన్నపూర్ణ, ప్రియా, చీరాల లక్ష్మి, లక్ష్మి, వాసిరెడ్డి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు అగ్నిప్రమాద ఘటనపై కేటీఆర్ ఆవేదన



**దశ, హైదరాబాద్:** జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అభయాంజనేయ స్వామి ఆలయ పరిసరాల్లో అర్ధరాత్రి జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు ఫోన్ చేసి మాట్లాడిన కేటీఆర్, క్షేత్రస్థాయిలో జరిగిన నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కోసం అప్పులు చేసి, ఎంతో కష్టపడి దుకాణాలు పెట్టుకున్న పేద, మధ్యతరగతి కుటుంబాలు ఈ ప్రమాదంతో ఒక్కసారిగా రోడ్డున పడ్డాయని కేటీఆర్ ఆవేదన చెందారు. షాపుల్లో ఉన్న సరుకు, బొమ్మలు, ఇతర సామాగ్రి సర్వం అగ్నికి ఆహుతి అయ్యాయని, దాదాపు 30 కుటుంబాల భవిష్యత్తు నాశనమైందని విచారం వ్యక్తం చేశారు. సుమారు కోటి రూపాయల వరకు ఆస్తి నష్టం జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. సకాలంలో ఫైర్ ఇంజన్లు రాకపోవడమే ఆస్తి నష్టం ఇంత భారీగా పెరగడానికి ప్రధాన కారణమని కేటీఆర్ మండిపడ్డారు. జగిత్యాల ఫైరింజన్ రిపేర్ లో ఉండటం, వచ్చిన ఒక ఇంజన్ పని చేయకపోవడం, గంట తర్వాత కోరుట్ల, కరీంనగర్ నుంచి వాహనాలు రావడం ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యానికి, నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ వైఫల్యానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సర్వం కోల్పోయిన ఈ కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. జరిగిన ఆస్తి నష్టం, పూర్తిగా దెబ్బతిన్న వ్యాపారాన్ని, దుకాణాలు ఏమాత్రం పనికిరాని స్థితికి చేరడాన్ని దృష్టిలో ఉంచుకొని, మానవతా దృక్పథంతో ఒక్కో కుటుంబానికి రూ. 30 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదం విషయం తెలియగానే అక్కడికి చేరుకుని, సహాయక చర్యల్లో పాల్గొని, బాధితులకు తక్షణ సాయంగా రూ. 5000 అందజేసిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ను కేటీఆర్ అభినందించారు. స్థానికులకు, నష్టపోయిన కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోకుంటే, పార్టీ తరపున ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

## కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు

- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్



**దశ, చిట్యాల :** కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని దానికి విద్య ప్రధాన ఆయుధమని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ అన్నారు. ఆదివారం చిట్యాల మండలంలోని వెలిమినేడు గ్రామంలో నాతి లక్ష్మీనరసింహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్య, ఉద్యోగ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్య అనేది ఏ ఒక్కరి సొంతము కాదని ప్రతి ఒక్కరు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని సూచించారు. చాలామంది నిరుద్యోగులు డిగ్రీలు, పీజీలు వంటి ఉన్నత విద్యలు అభ్యసించి ఎలాంటి ఉపాధి పొందలేక నిరాశ, నిస్పృహలకు లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి అన్నారు. యువత జీవితంపై ఆశతో విజయం దక్కేవరకు పోరాడుతూనే ఉండాలని అప్పుడే ఉన్నత లక్ష్యాలను అందుకుంటామన్నారు. చాలామంది యువత సున్నిత స్వభావంతో ఉండి నిరాశ నిస్పృహలకు గురికాకుండా ధైర్యంతో, తెగింపుతో, మొక్కవోని లక్ష్యంతో ముందుకు వెళ్లాలని అన్నారు. తమ తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఎన్నో ఆశలను, నమ్మకాలను వమ్ము చేయకుండా కష్టపడి చదివితే తప్పకుండా ఫలితం ఉంటుందని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ డిఎస్పి కె శివరాం రెడ్డి, నార్కెట్పల్లి సీఐ నాగరాజు, ఎస్సై మామిడి రవికుమార్, ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాతి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో కాళీ పోస్టులకు వ్రాత పరీక్ష



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** సింగరేణి కాలరీస్ కంపెనీలో ఖాళీగా ఉన్న జూనియర్ సానిటరీ ఇన్స్పెక్టర్(టి అండ్ ఎస్ గ్రేడ్ డి), జూనియర్ ఇన్స్పెక్టర్(టి అండ్ ఎస్ గ్రేడ్ డి) పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేసే దానిలో భాగంగా ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ పీజి కళాశాలలో వ్రాత పరీక్ష నిర్వహించటం జరిగింది. ఈ వ్రాత పరీక్ష సెక్యూరిటీ విజిలెన్స్ సిబ్బంది పర్యవేక్షణలో సిసి కెమెరాల నిఘా మధ్య నిర్వహించారు. సింగరేణి మహిళా డిగ్రీ పీజి కళాశాలలో జరిగిన ఈ పరీక్షను జిఎం(పర్సనల్) ఈఈ అండ్ ఆర్‌సి ఏజేఎం మురళీధర్ రావు, హెచ్ఓడి(విజిలెన్స్) పి.రాజీవ్ కుమార్ పర్యవేక్షించారు. పరీక్ష పూర్తిగా మెరిట్ పై ఆధారపడి ఉంటుందని దళారులకు ఎలాంటి ప్రమేయం ఉండదని వారిని నమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు. ఈ పరీక్ష ఫలితాలు సింగరేణి వెబ్ సైట్ సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం వద్ద నోటీస్ బోర్డుద్వారా తెలియజేయటం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ పరీక్ష నిర్వహణ పరిశీలనలో ఇంచార్జ్ జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ ఆర్ జివి.కిరణ్ కుమార్, జిఎం(పర్సనల్) ఈఈ అండ్ ఆర్‌సి ఏజేఎం మురళీధర్ రావు, హెచ్ఓడి (విజిలెన్స్)పి.రాజీవ్ కుమార్, డిజిఎం(పర్సనల్) పి.వేణు గోపాలరావు, డివైపిఎం డి.నాగేశ్వర రావు, ఏరియా సెక్యూరిటీ అధికారి జాకీర్ హుస్సేన్, విజిలెన్స్ ఆఫీసర్లు ఎండి.గౌసుద్దీన్, బి.సమ్మయ్య, సీనియర్ పిఓ పి.కాంతారావు, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతా శారద, ఇతర అధికారులు, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ సిబ్బంది ఉద్యోగులు పాల్గొన్నారు.

## నిక్కచ్చిగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు

- సర్పంచ్ ఎన్నికలలో ప్రలోభాలకు గురి చేస్తే చర్యలు తప్పవు
- స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి
- సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి



**దశ, రాజన్న సిరిసిల్ల జిల్లా :** సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) ను కఠినంగా అమలు చేయడంతో పాటు,ప్రలోభాలను నివారించేందుకు జిల్లా పోలీస్ శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టడం జరిగిందని సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల సమయంలో గ్రామాల్లో అభ్యర్థులు, వారి అనుచరులు డబ్బు పంచడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, కుల సంఘాలకు డబ్బు పంచడం,గ్రామ అభివృద్ధి పేరుతో డబ్బులు అడగడం, ఆశాచూపడం వంటి చర్యలపై ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.ప్రజలు భయభ్రాంతులు లేకుండా, స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా,శాంతియుత వాతావరణంలో జరిగేలా జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్ట్ లు, మండలాల వారిగా ఎఫ్ఎస్ టి బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం ఎన్నికలపై పర్యవేక్షణ చేయడం జరుగుతుందని డిఎస్పీ తెలిపారు.


## స్థానిక ఎన్నికల వేల.. బిఆర్ఎస్ లో చేరికల జోరు

- మాజీ MPTC సహా పలువురు కాంగ్రెస్ నేతలు BRS లో చేరిక
- గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి




**దశ, సూర్యాపేట:** స్థానిక సంస్థల ఎన్నికలు ప్రచారం జోరుగా కొనసాగుతున్న సమయంలో బిఆర్ఎస్ పార్టీలోకి చేరికలు జోరుగా కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎంపీటీసీ తో సహా పలువురు నాయకులు, కార్యకర్తలు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో గులాబీ గూటికి చేరారు. సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గం పరిధిలోని మటంపల్లి మండలం హనుమంతుల గూడెం, కామంచికుంట తండా గ్రామాలకు చెందిన మాజీ ఎంపిటిసి బొమ్మకంటి నరసింహారావు, బాదావత్ రాంబాబుతో పాటు ఆయా గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు ఆదివారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీమంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి గులాబీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, మాజీ సర్పంచ్ మన్నెం శ్రీనివాస్ రెడ్డి లతో పాటు గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..



## కాంగ్రెస్ పార్టీ నుంచి BRS లో చేరికలు

❖ గులాబి కండువాలు కప్పి పార్టీలోక్ ఆహ్వానించిన ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** తుంగతూర్తి నియోజకవర్గం అర్వపల్లి మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు BRS పార్టీ లో చేరారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో జిల్లా బిఆర్ఎస్ నాయకుడు మరిపెద్ది శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, బొల్లం వెంకన్న యాదవ్, చామకూరి మహేష్ గౌడ్ లు BRS లో చేరగా వారికీ మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి గులాబీ జెండాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, నాయకులు బొడ్డు సోమరాజు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

❖ క్రీడారంగానికి అధిక ప్రాధాన్యత
❖ సింగరేణి చైర్మన్ బలరాం
❖ గెలుపొందిన విజేతలకు బహుమతులు
❖ విజయవంతంగా ముగిసిన కబడ్డీ పోటీలు



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** క్రీడా పోటీలతో సంపూర్ణ ఆరోగ్యం లభించడంతో పాటు ఉత్సాహాన్నిస్తుందని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం అన్నారు. సింగరేణి కాలరీస్ కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో 202526 ఆర్థిక సంవత్సరానికి గాను రుద్రంపూర్ ప్రొఫెసర్ జయ శంకర్ స్టేడియం నందు మూడు రోజులపాటుగా జరిగిన కోల్ ఇండియా స్థాయి పురుషుల కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సింగరేణి ఛైర్మన్ ఎన్.బలరామ్ హాజరై విజేత టిమ్ లకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ కోల్ ఇండియా స్థాయి పురుషుల కబడ్డీ విజయవంతంగా నిర్వహించుకోవటం చాలా సంతోషంగా ఉందన్నారు. గత మూడు రోజులుగా నిర్వహించిన పోటీలలో 8 అనుబంధ సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కబడ్డీ జట్టు క్రీడాకారులు పాల్గొన్న ఈ కబడ్డీ పోటీలలో క్రీడాకారులు అందరూ అద్భుతమైన క్రీడాస్ఫూర్తితో పాల్గొన్నారని పేర్కొన్నారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజం అని తెలిపారు. కోల్ ఇండియా అనుబంధ సంస్థలు క్రీడకారులను ఎంతగానో పోత్సహిస్తూ దేశ వ్యాప్తముగా ఆటల పోటీలను నిర్వహిస్తూ క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నదని చెప్పారు. క్రీడలలో పాల్గొనటం వలన శరీరకముగా గానే కాకుండా మానసికంగా కూడా చాలా దృఢంగా ఉంటారని తెలుపుతూ పోటీలలో గెలుపొందిన డబల్యూసిఎల్, సింగరేణి ఎస్ఈసిఎల్ క్రీడాకారులను అభినందించారు. కబడ్డీ పోటీలలో డబల్యూసిఎల్ విజేతగా నిలువగా, సింగరేణి సంస్థ టీం మొదటి రన్నర్ గా ఎస్ఈసింఎల్ రెండవ రన్నర్ గా నిలిచిన టీంలకు సంస్థ ఛైర్మన్ ట్రోఫీలను అందజేసి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. బహుమతుల ప్రధానం అనంతరం ఒలంపిక్ పతాకాన్ని అవనతం చేసి కబడ్డీ పోటీల కార్యక్రమాన్ని ముగించారు.

జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు అధ్యక్షతన జరిగిన ఈ కబడ్డీ ఆటల పోటీలలో ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్ తో పాటు డైరక్టర్(ఆపరేషన్స్)ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్(ఈ అండ్ ఎం)ఎం.తిరుమలరావు, గుర్తింపు సంఘం (ఏఐటియూసి) ప్రెసిడెంట్ వి.సీతారామయ్య, ప్రాతినిధ్య సంఘం(ఐఎన్టియూసి) సీనియర్వైస్ప్రెసిడెంట్ సి.త్యాగరాజన్,సిఎంఓఏఐబిఈసిజాయింట్ సెక్రటరీ రాజ గోపాల్, కొత్తగూడెం ఏరియా సిఎంఓఏఐ ప్రెసిడెంట్ ఎం.వి.నరసింహా రావు, జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జివి.కిరణ్ కుమార్, జిఎం( ఫైనాన్స్)ఎం.సుబ్బారావు, ఎస్ఓటు జిఎం జివి.కోటి రెడ్డి, ఏరియా ఇంజనీర్ కే.సూర్య నారాయణరాజు, ఏజిఎం(సివిల్) సిహెచ్.రామ కృష్ణ, డిజిఎం(పర్సనల్)లు జీవి. మోహన్ రావు, కేసా నారాయణరావు, వైవిఎల్.వరప్రసాద్, బి.శివ కేశవరావు, కొత్తగూడెం ఏరియా గుర్తింపు సంఘం(ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ వి.మల్లికార్జునరావు, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, కొత్తగూడెం ఏరియా అధికారుల సంఘం జనరల్ సెక్రెటరీ ఎ.ఉపేంద్ర బాబు, అధికారులు, యూనియన్ నాయకులు, స్పోర్ట్స్ మేనేజర్ కే.సునీల్ కుమార్, సూపర్వైజర్ లు, పర్సనల్, ఎస్ అండ్ పిసి, ఈ అండ్ఎం, సివిల్ శాఖల సిబ్బంది బొగ్గు సంస్థల జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిక



**దశ, కోదాడ:** కోదాడ మండలం, కూచిపూడి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ కాసాని వెంకటేశ్వర్లు ఆదివార నాడు కోదాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూమాటి వరప్రసాద్ రెడ్డి, కోదాడ మాజీ వైస్ ఎంపీపీ మందలపు శేషయ్య సమక్షంలో చేరారు. అనంతరం వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలద్వారా ప్రజలతో మమేకమై, అభివృద్ధి పథంలో ముందుకు సాగిస్తున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పట్ల విశ్వాసంతో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలు



**దశ, హైద్రాబాద్ :** బీరం గూడా బాలాజీ ఫంక్షన్ హాల్ లో తెలంగాణ స్ట్రాంగెస్ట్ విమెన్ ప్రపంచ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ తెలంగాణ ప్రెసిడెంట్ శ్రీమతి ఇంటూరి రేఖ సారధ్యం లో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు రాష్ట్ర స్థాయి క్రీడాకారులు అన్ని విభాగాలలో పాల్గొని తమ సత్తా చాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సురక్ష సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపీ శంకర్ యాదవ్ హాజరై విజేతలకు బహుమతులు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. విజేతలు వచ్చే సంవత్సరం జరగనున్న జాతీయ క్రీడలలో తలపడ నున్నారు.ఈ కార్యక్రమంలో డబ్ల్యు పి సి చీఫ్ అడ్వైజర్ వరప్రసాద్, డబ్ల్యు పి సి ఇండియా ప్రెసిడెంట్ దల్జీత్ సింగ్,డబ్ల్యు పి సి చైర్మన్ ఇంటూరి కుమారి, ఆకుల రమాదేవి సంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్, హైదరాబాద్ జిల్లా ప్రెసిడెంట్ మజాద్ ఖాన్, రంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ అభిలాష్ బాబ్ డి , హైదరాబాద్ జిల్లా సెక్రెటరీ అస్లాం షా, కోచ్ లు రిఫరీ లు పాల్గొన్నారు.

## నామినేషన్ల కేంద్రాల వద్ద అధికారుల అప్రమత్తంగా ఉండాలి

❖ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్



**దశ మునగాల:** గ్రామ పంచాయతీ ఎన్నికల రెండవ దశ నామినేషన్ల స్వీకరణకు ఆదివారం ప్రారంభం కావడంతో నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీక రణకు నామినేషన్ పత్రాలు, హెల్ప్ డెస్క్ లతో సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ తెలిపారు. మునగాల మండల కేంద్రంలోని నామినేషన్ కేంద్రాన్నీ పరిశీలించి, నామినేషన్ల ప్రక్రియ పారదర్శకంగా జరగాలని అధికారులకు పలు సలహాలు సూచనలు అందించారు. ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరణకు సమయం ఉంటుందని, అభ్యర్థులు నిర్దేశించిన సమయంలోగా నామినేషన్లు వేసుకోవాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు, మార్గ దర్శకాలు, రద్దీ నియంత్రణ చర్యలకు అన్ని ఏర్పాట్లుతో సిద్ధంగా ఉంచాలని ఆయన సూచించారు. ఆర్డీవోలు ఎంపీడీవోలు ఆర్వోలు ఏఆర్వోలు ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## క్రీడల్లో గెలుపు కోసం శ్రమించాలి

❖ ఎంకేఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి)

**దశ, ఇబ్రహీంపట్నం:** క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని, గెలుపు కోసం నిరంతరం శ్రమించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామంలో మాజీ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్ రెడ్డి కుమారుడు కీర్తిశేషులు మంచిరెడ్డి విక్రం రెడ్డి జ్ఞాపకార్థంగా నిర్వహించిన ఎలిమినేడు ప్రీమియర్ లీగ్ సీజన్ 8 క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది.

ఈ కార్యక్రమానికి ఎంకేఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని, గెలుపు కోసం నిరంతరం శ్రమించాలని అన్నారు. యువతలో క్రీడా స్పోర్ట్స్ పెంపొందించడానికి ఇటువంటి టోర్నమెంట్లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బైరాపూర్ గ్రామ ప్రజలకు సేవ చేయడమే మా లక్ష్యం

❖ పోచారం శ్రీనివాస్ రెడ్డి,పోచారం భాస్కర్ రెడ్డి,కాసుల బాలరాజ్ వారి మద్ధతుతో
❖ సర్పంచ్ బరిలో కిష్టాపురం విట్టబాయి నర్సింలు



**దశ, బాన్సువాడ :** బీర్కూర్ మండలం : బైరాపూర్ గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ ప్రక్రియలో భాగంగా కిష్టాపురం విట్టబాయి నర్సింలు బీసీ మహిళా రిజర్వేషన్ కావడంతో సర్పంచ్ పదవికి పోటీ చేయునట్లు వారు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బైరాపూర్ గ్రామ సర్పంచ్ బరిలో మాపై ఎంతో నమ్మకంతో నిలబెడుతున్న ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి,మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి,ఆగ్రోఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాలరాజ్ గార్లకి వారు కృతజ్ఞతలు తెలిపారు.మరియు గ్రామ ప్రజలకు సేవ చేయాలనే ధ్యేయంతో సర్పంచ్ పదవికి పోటీ చేయాలనీ వారు నిర్ణయించుకున్నారు.

గ్రామ అభివృద్ధి,పారదర్శక పాలన,సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం ఇవే తమ ప్రాధాన్యతలు అని వారు పేర్కొన్నారు. గ్రామానికి అవసరమైన ప్రతి పనిని సాధించేందుకు కృషి చేస్తాము అని వారు అన్నారు.నిరంతర ప్రజా సేవలు చేయడం తమ బాధ్యత అని వారు హామీ ఇచ్చారు.ప్రజల హృదయలలో నిలవడమే మా లక్ష్యం అంటూ గ్రామ ప్రజల ఆశీర్వాదం కావాలని వారు కోరారు.గ్రామ ప్రజల అభిమానం,సహకారమే తమ విజయం నిర్ణహిస్తుందని వారు అన్నారు...మాకు మద్దత్తు తెలుపుతున్న మా బైరాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు & మాజీ PACS చైర్మన్ మొగుల గోండా & గ్రామ ముఖ్య నాయకులు విజయ్ పటేల్,మాజీ సర్పంచ్ రమేష్ పటేల్,పండరి పటేల్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాంబాబు,మాజీ ఎంపీటీసీ నారాయణ, సంజీవ్,రమేష్ గౌడ్, తుకరం,రామా గౌడ్ కాంగ్రెస్ కార్యకర్తలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## ఫైన్ వేశాడని, తిట్టాడని.. ట్రాఫిక్ కానిస్టేబుల్ పై దాడి

❖ కేసు నమోదు చేసిన సరూర్ నగర్ పోలీసులు

**దశ, ఎల్బీనగర్ :** రోడ్డుపై వెళ్తుండగా ఫైన్ వేశాడని ఆగ్రహం చెందిన వాహనదారుడు ట్రాఫిక్ కానిస్టేబుల్ దాడి చేసిన ఘటన సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే... సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్తపేట చౌరస్తా వద్ద విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ అప్పారావుపై ద్విచక్రవాహనదారుడు భరత్ రాయితో దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హెల్మెట్ లేకపోవడంతో చలాన్ వేయడంపై అసహనం చెందిన భరత్, 15 నిమిషాల తర్వాత తిరిగి వచ్చి కానిస్టేబుల్ పై దాడి చేసి పోలీసుల ట్యాబ్ను ధ్వంసం చేశాడు. స్థానికులు భరత్ ను పట్టుకుని పోలీసులకి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఈ నెల 26న ప్రాంతంలో కృష్ణయ్య, రాయుడు, సత్యానారాయణ, అప్పారావు తదితరులు కొత్తపేట హుడా జంక్షన్ వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో హెల్మెట్ ధరించకుండా (TG 07D 9744) ఎలక్ట్రిక్ బైక్ నడుపుతున్న భరత్ ని ఆపారు. హెల్మెట్ ఉల్లంఘనకు చలాన్ జారీ చేస్తుండగా, కానిస్టేబుల్ అప్పారావుతో గొడవపడి, తన బైక్ను అక్కడే వదిలేసి అక్కడి నుంచి పారిపోయాడు. దాదాపు 15 నిమిషాల తర్వాత, కంకర రాయితో అప్పారావుపై దాడి చేసి, ట్యాబ్ ని ధ్వంసం చేశాడు. దాడిలో అప్పారావు ఎడమ కంటికి రక్తస్రావం కావడంతో సమీపంలోని ఓమ్ని ఆసుపత్రికి తరలించారు. విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ పై దాడి చేసిన భరత్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సరూర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్ తరలించినట్లు పోలీసులు తెలిపారు.



## కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా సంగీతం శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం

**దశ, రాజన్న సిరిసిల్ల జిల్లా:** రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన డిసిసి అధ్యక్షులుగా ఎన్నికైన సంగీతం శ్రీనివాస్ ఆదివారం పదవి ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు గా బీసీ సంక్షేమ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, మాజీ పిసిసి అధ్యక్షులు, రాజ్యసభ మాజీ సభ్యులు వి. హనుమంతరావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కటకం మృత్యుంజయం, రాష్ట్ర నాయకులు చీటీ ఉమేష్ రావు లు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించి,నేతన్న విగ్రహానికి పూలమాలవేసి అనంతరం బస్ స్టేషన్ నుండి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నూతన రేషన్ కార్డులు, తెలంగాణ ప్రజలందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నియోజకవర్గంకి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తున్నామని , రైతు రుణమాఫీ ,రైతు భరోసా, సన్న వడ్లకి బోనస్ అందిస్తున్నామనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్,రాష్ట్ర,జిల్లా నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్నికల నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు

❖ రేపాల గ్రామంలో నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎస్పీ నరసింహ



**దశ, కోదాడ:** రెండో విడతలు జరగనున్న సర్పంచ్ ఎన్నికల సందర్భంగా ఆదివారం నుండి నామినేషన్ల ప్రారంభంకావడంతో మునగాల మండల పరిధి రేపాల గ్రామంలో నామినేషన్ కేంద్రాలను ఆదివారం నాడు జిల్లా ఎస్పీ నర్సింహా పరిశీలించారు. ఎన్నికలకు ఐదు అంచల పోలీసు భద్రత ఉండాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధి ఆంక్షలు అమలు చేయాలని అనుమతులు ఉన్న వ్యక్తులను మాత్రమే లోపలికి పంపించాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద పౌరులు గుంపుల చేరకుండా నిషేధ ఆజ్ఞలు ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని గ్రామాలలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గెలుపు ఓటములు సహజమని అందరూ ఒకే గ్రామం వారు కాబట్టి గొడవలు పెట్టుకోవద్దున్నారు. గతంలో నేరాలకు పాల్పడిన వారిని సమస్యలు సృష్టించే వారిని ముందస్తుగా బైండోవర్ చేస్తున్నామని అన్నారు, బైండవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే 2 లక్షల నుండి 5 లక్షల వరకు పూచ్చికత్తు నగదు చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ గారి వెంట కోదాడ డివిజన్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, మునగాల ఎస్సై ప్రవీణ్ కుమార్ ఎన్నికల సిబ్బంది ఉన్నారు.





## వైయస్సార్ కాలనీకి మౌలిక వసతులు కల్పించాలి

**దశ, బాన్సువాడ:** కామారెడ్డి జిల్లా బీర్కూరు మండల కేంద్రంలోని గత కొన్ని సంవత్సరాల క్రితం నుండి ఈ వైఎస్ఆర్ కాలనీ పరిస్థితి మరింత దారుణంగా దిగజారిన పరిస్థితి ఉంది కాబట్టి రోడ్లు లేక డ్రైనేజీలు లేక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్న సమస్యలు ఉన్నాయి అని ప్రజలు కోరుతున్నారు రోడ్లు డ్రైనేజీ పనులు చేయాలని పరిస్థితి వైఎస్ఆర్ కాలనీవాసులు కోరుతున్నారు ఈ చెట్లు పోదాలు దట్టమైన అడవిలో ఉన్న ప్రజలు అలానే కొనసాగిస్తున్నారు ఇప్పుడు ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే వారికి కూడా రోడ్లు లేక ట్రాక్టర్స్ రావాలంటే కూడా గుంతలో ఇరుకపోవడం చాలా ఇబ్బంది కలుగుతుందని ప్రజలు అంటున్నారు మరియు తొందర్లో ఈ రోడ్లు పూర్తిగా చేయాలని వైఎస్ఆర్ కాలనీవాసులు కోరుతున్నారు దయచేసి అయ్యా మీరు ఎంత తొందరలో చేస్తే ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే వారికి అంత బాగుంటుందని అంటున్నారు ఒకసారి చూస్తే అధికారులకు అర్థమవుతుంది ఈ కాలనీ పరిస్థితి ఇసుక ఇటుక తెచ్చుకొని ఇంటిదగ్గర పోయాలంటే కూడా ఎక్కడ గుంతలు దిగ పడుతుందని భయంతో ఎక్కడో పోసుకొని మోసుకుని పరిస్థితులు కూడా ఉన్నాయి ఈ కాలనీలో రోడ్లు సరిగా లేకపోవడం వల్ల వర్షపు నీరుతో మరింత దారుణంగా మారిన కాలనీ తొందరలో పూర్తి చేస్తారని కాలనీవాసులు అంటున్నారు.

జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..

04
సోమవారం
01-12-2025
WWW.DASHANEWS.COM

## కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు: జిల్లా ఎస్పీ

**దశ, చిట్యాల :** కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని దానికి విద్య ప్రధాన ఆయుధమని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ అన్నారు. ఆదివారం చిట్యాల మండలంలోని వెలిమినేడు గ్రామంలో నాతి లక్ష్మీనరసింహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్య, ఉద్యోగ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్య అనేది ఏ ఒక్కరి సొంతము కాదని ప్రతి ఒక్కరు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని సూచించారు. చాలామంది నిరుద్యోగులు డిగ్రీలు, పీజీలు వంటి ఉన్నత విద్యలు అభ్యసించి ఎలాంటి ఉపాధి పొందలేక నిరాశ, నిస్పృహలకు లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి అన్నారు. యువత జీవితంపై ఆశతో విజయం దక్కేవరకు పోరాడుతూనే ఉండాలని అప్పుడే ఉన్నత లక్ష్యాలను అందుకుంటామన్నారు. చాలామంది యువత సున్నిత స్వభావంతో ఉండి నిరాశ నిస్పృహలకు గురికాకుండా ధైర్యంతో, తెగింపుతో, మొక్కవోని లక్ష్యంతో ముందుకు వెళ్లాలని అన్నారు. తమ తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఎన్నో ఆశలను, నమ్మకాలను వమ్ము చేయకుండా కష్టపడి చదివితే తప్పకుండా ఫలితం ఉంటుందని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ డిఎస్పి కె శివరాం రెడ్డి, నార్కెట్పల్లి సీఐ నాగరాజు, ఎస్సై మామిడి రవికుమార్, ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాతి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు..



## అగ్రికల్చరల్ విద్యార్థుల పొలం బాట..

# అటు చదువు..
# ఇటు వ్యవసాయం..



- విద్యా స్ఫూర్తికి మాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాత్ర అమోఘం.!
- స్కూలే తోట.. విద్యార్థులే రైతులు.. కూరగాయలు పండిస్తున్న విద్యార్థులు
- ఈ స్కూల్స్ వెరీ స్పెషల్.. కూరగాయలు సాగు చేస్తూ మార్కులు పొందుతున్న. సాగర్ బీసీ గురుకుల
- ఈ పాఠశాల్లో పండించిన కూరగాయలతోనే విద్యార్థులకు భోజనం..!
- మహాత్మ జ్యోతిరావు పూలే సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు : ప్రిన్సిపాల్ రవికుమార్

**దశ, నలగొండ:**

ప్రస్తుత తరుణంలో ఎంతో అనుభవమున్న రైతులు కూడా వ్యవసాయాన్ని వదులుకుంటున్న ఘటనలు చూస్తున్నాం. కానీ, బిసి గురుకుల పాఠశాల విద్యార్థులు మాత్రం మేం పంటలు పండిస్తామంటూ పొలంబాట పట్టి తీవ్రంగా శ్రమిస్తున్నారు. కూరగాయలు పండించడంతోపాటు వరి పంటనూ సాగు చేస్తూ అందరినీ ఔరా అనిపిస్తు అబ్బురపరుస్తున్నారు. అసలు వీళ్లంతా ఎవరు? ఇది ఎక్కడ జరుగుతోంది. ఇదంతా ఎలా సాధ్యమయ్యింది? మీరు తెలుసుకోవాలనుకుంటున్నారా?



ప్రభుత్వ పాఠశాల అంటే కొంత మేరకు చిన్న చూపు ఉంటుంది. అందుకే కాస్త కష్టమైనా సరే.. పిల్లల భవిష్యత్తుకు బాగుండాలని ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తుంటారు. నల్లగొండ జిల్లా నందికొండ మున్సిపాలిటీ నాగార్జునసాగర్ లో వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల.. (మాత్మ జ్యోతిరావు పూలే) గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు.
అక్కడ చదువుకునే విద్యార్థులకు కలుషిత, రసాయన అవశేషాలతో కూడిన కూరగాయలకు బదులు.. తాజా కూరగాయలతో చక్కని భోజనాన్ని అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.
వ్యవసాయం దండుగ అని తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారనే అభిప్రాయం పిల్లల్లో బలంగా నాటుకుపోయింది. అందుకే పొలం పనులు చేద్దువురా బిడ్డా అంటే నావల్ల కాదమ్మా అని చెబుతుంటారు. గ్రామాల్లో ఇది చాలామందికి తెలిసిన విషయమే. ఇదే గమనించిన అక్కడి ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు విద్యార్థులు



వ్యవసాయంపై పూర్తిగా అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులే రైతులుగా మారి పాఠశాల ఆవరణలోనే పలు రకాల పంటలు పండిస్తున్నారు.నాగార్జునసాగర్ మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు : ఇక్కడి విద్యార్థులు చదువుతోపాటు ఇతర కార్యక్రమాల్లోనూ మరింత ముందుంటున్నారు. ఈ గురుకుల పాఠశాలలో మొత్తం 1300 మంది విద్యార్థులు ఉన్నారు విద్యార్థులు అంటే చదువేనా... కాదు.. వారికీ మానసిక ప్రశాంతత కావాలి. అందుకోసం ఆ స్కూల్ నిర్వాహకులు.. వ్యవసాయాన్ని నేర్పుతున్నారు. ఇప్పుడు ఆ విద్యార్థులే పాఠశాల ఆవరణంలో ప్రకృతి విధానంలో రకరకాల పంటలు పండిస్తున్నారు. తాజా కూరగాయలతో వారు భోజనం చేస్తున్నారు.. సాగర్ బీసీ గురుకుల
పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.
రోజులు మారాయి.. కెరీర్ ఓరియెంట్ చదువులు.. పట్టణ జీవనం నిత్యం ఉరుకులు పరుగులు.. చిన్నారులకు గ్రామాలతో పరిచయం తగ్గిపోవడం.. వంటి సమస్యలతో వ్యవసాయానికి దూరమవుతున్నారు.. చాలా మంది మన ప్రాంతంలో పండే పంటలు కూడా గుర్తించలేకపోతున్నారు.. విద్యార్థులు అంటే చదువేనా... కాదు.. వారికీ మానసిక ప్రశాంతత కావాలి. అందుకోసం ఆ స్కూల్ నిర్వాహకులు..వ్యవసాయాన్ని నేర్పుతున్నారు. ఇప్పుడు ఆ విద్యార్థులే పాఠశాల ఆవరణంలో రకరకాల కూరగాయ పంటలు పండిస్తున్నారు. తాజా కూరగాయలతో వారు భోజనం చేస్తున్నారు.. పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గంలో నందికొండ మున్సిపాలిటీలోని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చేతుల మీదగా 1987లో స్థాపించబడింది. గురుకుల పాఠశాల సేద్యంపై చైతన్యం తీసుకొచ్చేందుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే పాఠశాల ఆవరణలో కూరగాయల సాగుచేస్తూ.. విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నారు. గురుకుల పాఠశాల విద్యార్థులు భోజనానికి కావాల్సిన సేంద్రియ ఆకు కూరగాయలను, సొంతంగా పండించుకుంటున్నారు. అయిదో తరగతి నుంచి ఇంటర్ వరకు మొత్తం 1300 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల మొత్తం 40 ఎకరాల్లో విస్తరించి ఉంది. సుమారు రెండెకరాల స్థలాన్ని చదును చేసి కూరగాయలు, ఆకుకూరలతోపాటు వరి పంటను సాగు చేస్తున్నారు.

— **చందులాల్ బాణావత్,**
**సీనియర్ జర్నలిస్టు**


**చదువులో అంతర్భాగంగా విద్యార్థులతో సాగుబడి :**

**చదువులో అంతర్భాగంగా విద్యార్థులతో సాగుబడి చేయిస్తున్నారు ఉపాధ్యాయులు. కలం పట్టే చేతులన్నీ ఏకమై కర్షకుల్లా కష్టించి పంటలు పండిస్తున్నారు. రసాయనాలతో పని లేకుండా వివిధ సహజమైన ఎరువులను తయారు చేయించి మొక్కలకు అందిస్తున్నారు. చీడపీడల నివారణకు ప్రకృతిలో దొరికే ఆకులతో పలు కషాయాలను తయారు చేసి పిచికారి చేస్తున్నారు. దీంతో మొక్కలు ఆరోగ్యంగా పెరిగి నాణ్యమైన దిగుబడులను పొందుతున్నారు.**

**రవికుమార్, నాగార్జునసాగర్ మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాల ప్రిన్సిపాల్**



## తెలంగాణకు రెండో మణిహారం
# రెడీ చేసుకుంటున్నాం




**మొదటి పేజీ తరువాయి**
తేదీ రాత్రికి అధికారులు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. డిసెంబరు 3, 4 తేల్లో అన్ని శాఖలు ఇచ్చిన నివేదికలను సీఎస్, స్పెషల్ సీఎస్ , సీఎంవో అధికారులు పరిశీలించి, అవసరమైన మార్పులు, చేర్పులను చేసి తుది ప్రతి సిద్ధం చేయాలని మార్గనిర్దేశం చేశారు. 6వ తేదీ సాయంత్రం వరకు తెలంగాణ రైజింగ్ విజన్ 2047 డాక్యుమెంట్ సంపూర్ణంగా సిద్ధం కావాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ రూపకల్పన కోసం పూర్తి సమయం కేటాయించాలని హుకుం జారీ చేశారు. గ్లోబల్ సదస్సు ఏర్పాట్లు నిర్వహణలో శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు.

## రాహుల్ గాంధీకి కేటీఆర్ సంచలన లేఖ

**మొదటి పేజీ తరువాయి**
.హైదరాబాద్ నగరంలోని బాలానగర్, జీడిమెట్ల, సనత్‌నగర్, ఉప్పల్, మల్లాపూర్, రామచంద్రాపురం, హయత్‌నగర్ వంటి కీలక క్లస్టర్‌లలో గత ప్రభుత్వాలు సుమారు 9,300 ఎకరాల పారిశ్రామిక భూమిని కేటాయించాయని గుర్తుచేశారు. ఈ భూములను మొదట పారిశ్రామిక వృద్ధి, ఉపాధి కల్పన, దీర్ఘకాలిక ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించడానికి రాయితీ ధరలకు ఇచ్చారని పేర్కొన్నారు . అయితే, కొత్త HILTP కింద, పారిశ్రామిక భూములను కలిగి ఉన్నవారు ఇప్పుడు ఆ భూములను వాణిజ్య లేదా నివాస జోన్‌లుగా మార్చుకోవడానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం విలువలో కేవలం 30శాతం మాత్రమే చెల్లిస్తే చాలని చెప్పుకొచ్చారు. ప్రస్తుత మార్కెట్ ధరల చాలా రెట్లు ఎక్కువగా ఉన్నప్పటికీ, ఈ విధానం ప్రజలకు దక్కాల్సిన ఆస్తులను తక్కువ ఖర్చుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి, లక్షల కోట్ల విలువైన భూమిని నామమాత్రపు ధరకు క్రమబద్ధీకరిస్తోందని తెలిపారు. వేల కోట్ల విలువైన ఆస్తుల



మార్పిడికి 45 రోజుల్లో ఫాస్ట్‌ట్రాక్ ఆమోదాలు ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయంపై కూడా సందేహాలు వ్యక్తం చేశారు. ఇంత తొందరపాటుతో కూడిన ప్రక్రియలో పారదర్శకతలేదని, కేవలం డబ్బులు దండుకోవాలనే సరైన విచారణ లేకుండానే ఈ భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొందరపాటుతనం, ఈ మొత్తం పాలసీలో దాగున్న రాజకీయ అవినీతి అనేక ప్రశ్నలను లేవనెత్తుతోందని ధ్వజమెత్తారు. అలాగే, రాహుల్ గాంధీకి రెండు కీలక ప్రశ్నలు సంధించారు కేటీఆర్. తెలంగాణలో పెద్దఎత్తున జరుగుతున్న అక్రమాల గురించి వెంటనే స్పందించాలని కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న రూ.5 లక్షల కోట్ల అవినీతి స్కామ్‌ని అడ్డుకోవాలని సూచించారు. లేకపోతే దేశ చరిత్రలోనే అతిపెద్ద భారీ భూ కుంభకోణంలో రాహుల్ గాంధీ మౌనంగా ఉండటం సరికాదని అన్నారు. రాహుల్ గాంధీ స్పదించకపోతే ఈ స్కాంలో భాగస్వామ్యం ఉందని, కాంగ్రెస్ హైకమాండ్ అనుమతితోనే రూ.5 లక్షల కోట్ల భూకుంభకోణం తెలంగాణలో జరుగుతోందని భావించాల్సి ఉంటుందని అన్నారు. రాహుల్ గాంధీ ఈ అంశంలో ఇప్పటికైనా మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఈ భారీ అవినీతికి అడ్డుకట్ట వేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తన అవినీతి కోసం తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెడతామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తాము ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తునే ఉంటామని స్పష్టం చేశారు. తాను రాస్తున్న ఈ బహిరంగ లేఖకు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ హై కమాండ్ ఇచ్చే సమాధానం తెలంగాణ ప్రయోజనాలను కాపాడే విధంగా ఉండాలని కోరారు .

## ఆన్లైన్ బెట్టింగ్ తో అప్పుల పాలై
## యువకుడు ఆత్మహత్య

**దశ,ఉప్పల్ :** ఆన్లైన్ బెట్టింగ్ లో డబ్బులు పోగొట్టుకొని అప్పుల పాలై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ లో నివాసముంటున్న పాలడుగు సాయి(24) వృత్తిరీత్యా డ్రైవర్ గా పని చేస్తున్నాడు. గత కొంతకాలంగా ఆన్లైన్ బెట్టింగ్ యాప్ లో బెట్టింగ్లు నిర్వహించాడు. బెట్టింగ్ యాప్ లో డబ్బులు పోగా అప్పుల పాలయ్యాడు.
అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాలుపడ్డాడు అపరమారక స్థితిలో ఉన్న సాయిని చూసిన తండ్రి చంద్రయ్య గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సాయి ఆదివారం పొద్దున్న తొమ్మిదిన్నర గంటల ప్రాంతంలో మృతి చెందినట్లు గాంధీ వైద్యులు నిర్ధారించారు. తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు